


"అయ్యో రామ! ఇంకా అలాగే కూర్చున్నా రేవిటండి నిమ్మకి నీరెత్తినట్టూ!"

"ఊఁ" ముకుందరావుగా రన్నారు భార్య వంక చూస్తూ.

"సరిపోయింది. అల్లుడూ అమ్మాయీ వస్తోంది పదకొండు గంటలబండికేనండీ - స్టేషన్‌కెళ్ళి తీసుకురారూ?"

"వెళతానుండవే."

"ఇంకెప్పుడండీ. అయ్యో సిగ్గు! అల్లుడన్న ఇదే లేదేవండి మీకూ."

"నాకొంచెం దడగా వుందే."

"దడెందుకండీ అల్లుడేవన్నా పులా సింహవా? కొరుక్కు తింటాడనుకోడానికి? మొన్న అమ్మాయీవాళ్ళు వస్తున్నామని ఉత్తరం వచ్చినప్పట్నుంచి చూస్తున్నాను మీ వరస. ఎంత ఇదైతేమాత్రం ఇంత ఇదా? అల్లుళ్ళన్నాక పండగలకి రానూ వస్తారు మనం పెట్టనూ పెట్టాలి. మావాళ్ళు మీకుమాత్రం పెట్టలేదూ? చోద్యం చాలుగాని ఇంక లేవండి బండొచ్చే వేళయ్యిందిగాని."

ఉస్సురంటూ నిట్టూర్చి లేచి పైకండువా వేసుకొని చెప్పులు తొడుక్కుని "నేనలా స్టేషన్ కెళ్ళొస్తానుగాని ఇల్లు జాగ్రత్త" అని చెప్పి స్టేషన్‌కి వెళ్ళారు ముకుందరావుగారు.

సింహప్రసాద్

ముకుందరావుగారికి మగపిల్లలేరుగాని వున్న ముగ్గురూ ఆడపిల్లలే. ఒక్కొక్కళ్ళకీ రెండేసి సంవత్సరాల తేడా వుండటంతో మొదటి ఇద్దరు అల్లుళ్ళకీ బాగానే జరిపించారన్నీ. అదే సమయంలో అల్లుళ్ళంటే యమభటులన్న భావం, భయంకూడా ఆయన్లో పాతుకుపోయాయ్. అప్పట్లో వుద్యోగం వుంది గనుక ఏదోలా బండి లాగించేశారు. అల్లుళ్ళ అలకలు చాలవరకు తీర్చేశారు. కాని మూడో అమ్మాయి పెళ్ళవడంతోనే తను రిటైరై పోవడంతో పెన్షన్ డబ్బులూ, ఇంటిఅద్దె, కొద్దో గొప్పో వున్న పొలంమీదవచ్చే ఆదాయమూ తప్ప చెప్పుకోదగ్గ ఆదాయం లేదు. అందువల్ల మూడో అల్లుడి కోరికలు తీర్చడం ఎలారా భగవంతుడా అని ఇదయ్యేరుగాని అతగాడు మంచివాడవడంవల్ల పెళ్ళయ్యాక రెండుమూడుసార్లు ఏవో పండగలకి వచ్చినా నోరుతెరచి ఏమీ అడక్కపోవడంతో వూపిరి పీల్చుకుని ఓసారి మూడు వందలు, ఇంకోసారి ఐదొందలూ ఇచ్చారు. వద్దంటూనే తీసుకున్నాడతడు. కాని పెళ్ళయ్యాక రెండు సంక్రాంతులు వెళ్ళినా అతగాడేవో కేంపులదృష్ట్యా రాలేదు. ఈ సంక్రాంతికి మాత్రం వస్తున్నాడు. అంచేతే ముకుందరావు గారికి గాభరాగా వుంది.

సంక్రాంతి పెద్దపండుగ గనుకనూ పెళ్ళయ్యాక అతడీ పండక్కి రావడం ఇప్పుడే గనుకనూ అతదేదో పెద్దకోరిక కోరతాడేమోనని ఆయన భయం. ఈ అల్లుడు మంచివాడే అని ఎంత సర్ది చెప్పుకుందామనుకున్నా 'అల్లుడి మంచితనం' గురించి తనకి తెలియందేముందీ అని ఇదవుతున్నారు. అలా అని బొత్తిగా అల్లుడ్ని ఒట్టిచేతుల్తో పంపాలన్న వుద్దేశ్యమూ లేదుగాని నాలుగొందలు ఇద్దామని జాగ్రత్తచేశారు. అయినా అంతకిమించి కోరిక కోరితే....? అన్నదే ఆయన్ని వేధిస్తోన్న భయం!

ఇంతలో కూతవేస్తూ రైలొచ్చింది.

తడబడుతూనే ప్లాట్‌ఫారంమీది కెళ్ళారు. మరి కొంచెం సేపట్లోనే అల్లుడూ కూతురు వున్న పెట్టెని కనుక్కున్నారు. వాళ్ళని పలకరించి సామానుని కూలీల కందిచ్చి కూతురి చేతిలోంచి మనవడ్ని తీసుకున్నారు.

"ప్రయాణం బాగా సాగిందా బాబూ" మనవడ్ని ముద్దుచేస్తూ అడిగారు.

"బాగానే సాగిందండీ అంతా కులాసాయే కదా"

"ఆ-కులాసాయేలే."

"అమ్మ ఆరోగ్యం బావుంటోంది కదా నాన్నా? అక్కలెవరైనా వస్తున్నారా?"

"వీలుంటే వస్తామని రాశారు.........."

అంటోంటే రెండేళ్ళ మనవడు తినుబండారాల వంక చూపిస్తూ ఎగురుతూంటే, "తప్పురా బాబీ- అలా అడక్కూడదు" అంటూ వారించాడు అల్లుడు.

"తాత నా మాత్రం అడక్కూడదేవిట్లే" అంటూ బిస్కెట్లపాకెట్ కొన్నారు.

అంతా బయటికొచ్చి ఆటోలు ఎక్కారు.

ముకుందరావుగారికి కొంచెం హుషారుగా వుంది. తినుబండారాలనే అడక్కూడదంటూ కొడుకుని మందలించిన అల్లుడు తనని మాత్రం ఫలానాది కావాలని ఎలా అడుగుతాడూ? అడగడు. అసలీ అల్లుడి తత్వమే వేరు. చాలా మంచివాడు - అని సంబరపడిపోతున్నారు.

ఇంటిముందు ఆటోలు ఆగాయ్. అల్లుడు డబ్బులిస్తానంటోంటే వద్దని ఆపి తనే ఇచ్చేశారు ముకుందరావుగారు.

మరోగంటకి ఆయిన భార్య కంచిపట్టు చీరనీ ఓ పంచె కండువాల్నీ తెచ్చి మహదానందంగా చూపిస్తూ అంది "మన అల్లుడూ అమ్మాయీ మనకి తెచ్చారండీ. ఈ చీర డిజైన్ చూడండి ఎంత బావుందో. ఎదురింటి మీనాక్షి ఆ మధ్యకొన్న చీరకన్నా బావుంది కదండీ?"

"ఊఁ-మొత్తం ఎంతై వుంటుందంటావ్?"

"నాలుగొందలవరకూ అయ్యుండిదంటారా? ఈ చీరే వుంటుంది కదండీ మూడొందల యాభైవరకూ."

హార్వర్డు మెడికల్ స్కూలుకు సంబంధించిన డా॥ షారన్ విల్స్‌నాక్ స్త్రీలు సుకుమారంగానూ అందంగానూ వుండాలనుకుంటే, రోజూ కొంత బ్రాందీ సేవించాలంటున్నారు! అమెరికా స్త్రీలకి మద్యపానం మామూలే. ఐతే దాన్ని తగు మోతాదుల్లో జాగ్రత్తగా వాడితే తమ సౌందర్యానికి మంచిదని యిప్పుడిప్పుడే తెలుసుకున్నారు. మోతాదుకు మించితే ఉన్న సౌందర్యం కాస్తా పోవడమే కాకుండా, స్త్రీలలో పురుషలక్షణాలు ఏర్పడే ప్రమాద ముందంటున్నారు డా॥ విల్స్‌నాక్!

(వి)చిత్ర విజ్ఞానం



ఆయన మాట్లాడలేదు. ఉస్సురంటూ నిట్టూర్చారు.

"అదేవిటండీ శుభమా అంటూ అల్లుడూ అమ్మాయీ పండక్కి వస్తూ పట్టుకొస్తే సంతోషించడంపోయి అలా దివాళాతీసినవాళ్ళా చూస్తారేవిటండీ కర్మ!"

"అల్లుడు నాలుగొందలు కర్చుపెట్టి మనకి బట్టలు తెచ్చాడంటే మనం ఏనిమిదివందలన్నా ఇవ్వకపోతే బావుంటుందంటావా?"

అప్పటి కర్థమయ్యిం దావిడకి. కొన్ని క్షణాలవరకూ మాట్లాడలేకపోయారు. ఆ పిమ్మట "ఆమాటే మర్చిపోయాను సుమండీ. మనదగ్గర నాలుగొందలకన్నా ఎక్కువలేవు కదండీ ఇవ్వడానికి. ఇప్పుడెలాగండీ" అన్నారావిడ దిగాలుపడిపోయి నేలమీద చతికిలబడుతూ.

"బ్యాంకులో ఇంకో మూడొందల చిల్లర వరకూవుంది గనుక అదీ ఇదీ కలిపి ఇవ్వచ్చనుకో. కానీ ఏ ఖరీదైన వస్తువో అడిగితే?" తన అనుమానాన్ని బయటపెట్టారాయన.

"అబ్బే మన చిన్నల్లుడు అలాటివాడు కాదండీ. పెళ్ళయి ఇన్నేళ్ళయ్యింది ఒక్కసారైనా నోరు తెరచి ఇది కావాలి అది కావాలంటూ అడిగేడాండీ? మనం ఇచ్చింది సంతోషంగా పుచ్చుకోవడమే తప్ప గొంతెమ్మ కోర్కెలు కోరడం మనల్లుడికి తెలీదండీ."

"అదీ నిజమే అనుకో కానీ సంక్రాంతి పండక్కి చిన్నల్లుడు రావడం ఇప్పుడే కదా అని భయంగా వుంది."

"ఎక్కడలేని భయాలూ మీకే వస్తాయి గాని వూరుకోండి. నే చెబుతున్నాగా. ఏ అల్లుడైనా మనకిలా బట్టలు తెచ్చాట్టండీ? అసలు మన చిన్నల్లుడి వద్దతే వేరండీ" అంటూ వెళ్ళిపోయిం దావిడ క్రొత్త బట్టల్ని ఇరుగుపొరుగు వారికి చూపించడానికి.

ఆలోచించగా ముకుందరావుగారి క్కూడా ఆ మాటలమీద నమ్మకం కలిగింది.

అయినా ఆ రాత్రి ఆ ఇద్దరికీ కూడా సరిగ్గా నిద్రపట్టనేలేదు!

మర్నాడు "మేం బట్టలు కొనుక్కుంటాన్నాం మీరు కూడా సెలక్టు చేద్దురుగాని రండి" అంటూ ముకుందరావు దంపతుల్ని రమ్మన్నారు వారి అల్లుడూ కూతురునూ.

ముకుందరావుగారి భార్య ఇంట్లో పనుందంటూ తప్పుకుందిగాని ముకుందరావుగారికింకోదారి కన్పించలేదు తప్పుకోడానికి. "మీకు నాణ్యం బాగా తెలుసు. మీరు తప్పకుండా రావాలి" అంటూ అల్లుడు పట్టుబట్టడంతో కాదన్లేక పోవడమేకాదు ఆ ఖర్చు తన నెత్తిన రుద్దడానికే ఈ ఎత్తు అని తీర్మానించుకున్నారు. అయినా వెళ్ళక తప్పదు కనుక అల్లుడికి బహుమతిగా ఇద్దామని వుంచిన డబ్బు తీసుకుని బయల్దేరారు.

బట్టలషాపులో భార్యాభర్తలిద్దరూ లేటెస్ట్ డిజైన్స్ చూపించమంటూ షాపులోని బట్టలన్నీ తిరగేస్తోంటే తనకేం పట్టనట్టు ఓ ప్రక్కన కూర్చుండిపోయారు ముకుందరావుగారు. రంగు గురించీ డిజైన్ గురించీ మెత్తదనం గురించీ వాళ్ళలోవాళ్ళు తర్కించుకుంటున్నారుగాని తనతో ఒక్కమాట కూడా అనటం లేదు. దాంతో తప్పకుండా ఈ ఎత్తు తనచేత ఖర్చుపెట్టించటానికే అని అదివరకనుకున్న దాన్ని గట్టిగా బలపర్చుకుని "ఏఏ రకాలుగా మావగారిని దోచుకోవచ్చో అల్లుళ్ళకి తెలిసినట్టు ఎవరికీ తెలీదు సుమా. అయినా తన పిచ్చిగాని అల్లుళ్ళలో మంచితనం వెదకటమంటే నేతిబీరకాయలో నెయ్యి వెదకడమే!" అనుకున్నారు నిరుత్సాహంగా.

బిల్లు 316రూపాయలయ్యింది. "బ్రతికాంరా దేవుడా" అనుకున్నారు ముకుందరావుగారు. డబ్బివ్వడానికి జేబులో చెయ్యిపెట్టేరుగాని అంతలోనే బిల్లు చెల్లించేశాడు అల్లుడు.

"అదేవిటల్లుడూ నువ్వివ్వడం ఏమిటీ...." అంటూ ఆయనేదో అంటోంటే, "భలేవారే. మిమ్మల్ని తీసుకొచ్చింది మీచేత కొనిపించటానికా" అని నవ్వాడతడు.

ఆయన వుక్కిరిబిక్కిరయ్యాడు సంతోషంతో.

తర్వాత సినిమాకెళ్దామంటే వాళ్ళని వెళ్ళమని చెప్పి తను ఇంటికొచ్చేశారు బట్టల్తో. వస్తూనే "మనల్లుడు అందర్లాటివాడు కాదే. చాలా గొప్పమనిషనుకో. అల్లుళ్ళలో ఇంత మంచివాళ్ళుంటారని నేను కల్లోకూడా అనుకోలేదోయ్" అన్నారు పరమానందంగా.

"ఏవండీ ఏం జరిగిందండీ."

"ఇంకా ఏం జరిగిందని నెమ్మదిగా అడుగుతావేమే బట్టలకి నేనిస్తానంటే వద్దనిచెప్పి తనే ఇచ్చాడే మనల్లుడూ" గర్వంగా అన్నారు.

"నిజవాండీ? మనల్లుడు అందర్లాటివాడు కాదని నేను మొదట్నుంచీ అంటూనేవున్నాను కదండీ. ఎంతైనా అమ్మాయి అదృష్టవంతురాలండీ."

"అమ్మాయేకాదే మనమూ అదృష్టవంతులమేనే. ఇదివరకిద్దరి అల్లుళ్ళ అలకలూ చచ్చీ చెడీ తీర్చినవాణ్ణి గనుక ఇతనూ అలాటివాడేనని ఇదయ్యాన్లే. అదృసరేగాని మనం ఎలాగూ నాలుగొందలు ఇద్దామనుకుంటున్నాం గనుక ఇంకో వందవేసి ఇద్దాం. ఎంత తను అడక్కపోయినా మనం తక్కువగా చూడకూడదుకదా. రేపు బ్యాంకుకెళ్ళి డబ్బు తెస్తాలే. అన్నట్టు నాలుగైదు రకాల పిండివంటలూ అవీ చెయ్యి. డబ్బుకి లోభించకు. అల్లుడూ అమ్మాయీ తృప్తిగా వెళ్ళాలిక్కణ్ణుంచి. మరెలా సన్నెత్తుతావో నీ ఇష్టం."

"చూస్తూ వుండండి ఏం చేస్తానో. అన్నట్టు సాయంత్రం మంచి బెల్లంపట్రండి. పాకుండలొండి వెళ్ళేప్పుడిస్తాను. అవంటే అల్లుడికెంతో ఇష్టం. మొన్నపెట్టిన వడియాలన్నీ అమ్మాయికిచ్చేద్దామండీ మనం కావలిస్తే తర్వాతెప్పుడో పెట్టుకోవచ్చు. పచ్చళ్ళుకూడా ఇస్తే బావుణ్ణుగానీ — పోనీ దబ్బకాయ పచ్చడిద్దామండీ కొంచెం సంవత్సరాది వెళ్ళేక ఆవకాయపెట్టి పంపిద్దాం...."

మొగుడూ పెళ్ళాలిద్దరూ ఆనందాంబుధిలో స్నానమాడుతూ కూతురూ అల్లుళ్ళకెన్నెన్నో పెట్టాలనీ ఏవేవో చేసివ్వాలనీ పోటీలుపడి అనుకోవడమేకాదు వెంటనే ఆచరణలో పెట్టారు కూడానూ.

మర్నాడు డబ్బు తీసుకోడానిగ్గాను బ్యాంక్కెళ్ళారు ముకుందరావుగారు. అక్కడాయన బాల్య స్నేహితుడు రామనాథంగారు కన్పించారు.

"ఏవిటోయ్ అలా దిగాలుగా వున్నావ్" ముకుందరావుగారన్నారు మిత్రుడితో.

"దిగులుగాక ఇంకేవిట్లే. మా అల్లుడొచ్చాడుగా. అతగాడొస్తే చాలు పది పదిహేను రోజులవరకూ వెళ్ళడు. అంతవరకూ అన్ని మర్యాదలూ చేసి అతడు కోరిందిచ్చేసరికి తలప్రాణం తోక్కొస్తుందనుకో. అదృసరే— అంత వుషారుగా వున్నావేమిటి కథ? మీ అల్లుళ్ళెవరూ పండక్కి రాలేదా?"



"చిన్నల్లుడు వచ్చాళ్ళగాని అతగాడి తరహా పూర్తిగా వేరోయ్—వజ్రపు తునక అనుకో."

"నిజవాఁ? అలాటి అల్లుళ్ళూ వుంటారంటే నమ్మలేకపోతున్నా ననుకో. అసలు మా అల్లుడొస్తున్నాడూ అంటే చాలు ఎక్కడికైనా పారిపోయి దాక్కుంటే బావుంటుందన్పిస్తుందనుకో. చిన్నప్పుడు మనం 'పులీ మేకా' ఆట ఆడేవాళ్ళం గుర్తుందా? "పులొచ్చె మేక దాక్కో దాక్కో" అని మీరంతా అంటూ చుట్టూ వలయంగా తిరుగుతోంటే నేనెన్నడూ పులికి దొరక్కుండా తప్పించుకుంటూండేవాడ్ని. అంచేత ప్రతిసారీ నన్నే మేకగా వుండమనీ ఆట రక్తి కడుతుందనీ అనేవాళ్ళప్పుడు. కానిప్పుడు అల్లుడు పులికి అనుక్షణం దొరికి చావు దెబ్బలు తింటున్నాననుకో" అన్నారు గాద్గదికంగా.

"వూరుకోవోయ్ వూరుకో".

ఆయనల్లుడితో తన చిన్నల్లుడ్ని పోల్చుకుని అందల మెక్కినట్టుగా పొంగిపోయారాయన. రిటైరై పోయానే అల్లుడి అడుగులకు మడుగులొత్తగలనా లేదా అని ఇదైనందుకు మంచి అల్లుడ్నే ఇచ్చాడు దేవుడని మురిసిపోయారు ముకుందరావుగారు.

పెద్దపండుగ రోజున తల్లీ తండ్రీ తీరిగ్గా కూర్చుని కబుర్లు చెప్పుకొంటోంటే వారమ్మాయి కూడా వచ్చి కూర్చుంది.

"అల్లుడికి పండుగ బహుమతి ఏం కావాలో కనుక్కో అమ్మా" అన్నారు గొప్పగా ముకుందరురావుగారు అతగాడేం అడగళ్ళే అనుకుంటుంటూ.

"అది చెబుదామనే వచ్చాన్నాన్నా. పెళ్ళయ్యాక ఆయనింతవరకూ ఏ పండక్కీ ఏమీ అడగలేదు కదా అంచేత అన్ని పండగలకీ కలిపి ఈ పండక్కి స్కూటర్ కొనిమ్మని అడగమన్నారాయన. స్కూటర్ మాకు చాలా అవసరం నాన్నా. బావ లిద్దరికీ అడిగినవన్నీ ఇచ్చినట్టే మాకూ ఇవ్వు నాన్నా. కాదంటే బావలు ఒకో పండక్కీ ఒకోటి అడిగారు. మేం ఒక్కసారే కాస్త పెద్దదడుగుతున్నాం. మీ చిన్నల్లుడికి ఆ మాత్రం ఇవ్వవా నాన్నా అడక్క అడక్క అడిగినందుకు?"

నోటమాటలేక శిలా ప్రతిమల్లా వుండిపోయారు నోరు తెరచి ముకుందరావు దంపతులు!

□